# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో ఆరుగురు మావోయిస్టులు మరణించారు.
- రాష్ట్రంలో పలు చోట్ల ఆశ్రయం పొందుతున్న 50 మందికి పైగా మావోయిస్టులను పోలీసులు ఈరోజు అదుపులోకి తీసుకున్నారు.
- అత్యవసర వైద్య సేవల కోసం రాష్ట్రంలోని 24 ప్రభుత్వ ఆసుపత్రుల్లో 600 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ బ్లాక్స్ (CCB)లను నిర్మిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 22న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఈరోజు తెల్లవారుజామున పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో సెంట్రల్ కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా అలియాస్ సంతోష్ సహ ఆరుగురు మావోయిస్టులు మరణించారు. మృతుల్లో హిడ్మా భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ ఉన్నారు. మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం అందిన నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ ఇంకా కొనసాగుతోందని చెప్పారు.

======================

రాష్ట్రంలో పలు చోట్ల ఆశ్రయం పొందుతున్న 50 మందికి పైగా మావోయిస్టులను పోలీసులు ఈరోజు అదుపులోకి తీసుకున్నారు. కృష్ణా జిల్లాలోని పెనమలూరు నియోజకవర్గం న్యూ ఆటోనగర్ ప్రాంతంలో ఒక భవనంలో ఆశ్రయం పొందుతున్న 28 మంది మావోయిస్టులను ఇంటెలిజెన్స్, ఆక్టోపస్ బృందాలు, స్పెషల్ బ్రాంచ్ సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా ఏలూరు గ్రీన్ సిటీలోని గేటెడ్ కమ్యూనిటీలో పోలీసులు కూంబింగ్

నిర్వహించి 15 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈరోజు తెల్లవారుజామున మారేడుమిల్లిలో జరిగిన ఎన్ కౌంటర్ లో మావోయిస్టు అగ్ర నేత హిడ్మా మరణించగా అక్కడ లభించిన ఒక డైరీలోని సమాచారం ఆధారంగా రాష్ట్రంలోని కృష్ణా, ఎన్టీఆర్, కాకినాడ, అల్లూరి, ఏలూరు జిల్లాల్లో పలు చోట్ల పోలీసులు సోదాలు నిర్వహించారు. అందులో భాగంగా పీపుల్స్ ఆర్మీ గెరిల్లాకు చెందిన 28 మంది మావోయిస్టులను, పెద్ద ఎత్తున సాహిత్య పుస్తకాలు, ఆయుధ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

అత్యవసర వైద్య సేవల కోసం రాష్ట్రంలోని ముఖ్యమైన 24 ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొత్తగా క్రిటికల్ కేర్ బ్లాక్స్ (CCB) లు రాబోతున్నాయని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (PM ABHIM) కింద 600 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన వీటి నిర్మాణాలను వచ్చే ఏడాది ఆగస్టులోగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించినట్లు వైద్య ఆరోగ్య శాఖ ఈరోజు ఓ ప్రకటనలో తెలిపింది. వచ్చే నెలాఖరు నాటికి 13 సీసీబీలను వినియోగంలోనికి తెచ్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంటోందని, వీటి ద్వారా అదనంగా 1,275 పడకలు అందుబాటులోనికి వస్తాయని తెలిపింది. పది పడకలతో ఒక ఐసీయూ, ఆరు పడకలతో మినీ ఐసీయూ, 24 ఐసోలేషన్ పడకలతో పాటు విడిగా డయాలసిస్, మెటర్నటీ పడకలు, క్యాజువాల్టీ వార్డు అందుబాటులోనికి వస్తుందని, వీటి ద్వారా గుండె, శ్వాసకోశ సంబంధిత కేసులు, పాయిజన్ కేసులు, డయాలసిస్, మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ ఇతర కేసులకు చికిత్స అందిస్తారని పేర్కొంది.

=======================

నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విజయనగరంలో ఈరోజు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వీటీ అగ్రహారంలో ఉన్న పభుత్వ ఐటీఐ కళాశాలలో పలు శాఖల అధికారులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ.. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఎక్కడైనా మత్తు పదార్థాలను వినియోగించినా, విక్రయించినా, అక్రమంగా రవాణా చేసినా 1972 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

విరామం

=======================

రాష్ట్రంలోని పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలపై సానుకూలమైన స్పందన లభిస్తోందని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో లేఖ ద్వారా కేంద్రానికి సూచించిన ఆరు కీలక అంశాలపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని మూడు అంశాల అమలు ప్రక్రియను ప్రారంభించిందని, దీనివల్ల పత్తి కొనుగోలులో ఏర్పడిన సమస్యలు పరిష్కారం దిశగా సాగుతున్నాయన్నారు. కొనుగోలు కేంద్రాలు కూడా దశల వారీగా ప్రారంభమయ్యాయని, కొనుగోలు ప్రక్రియ మొదలైందని తెలిపారు. అయితే మొంథా తుఫాన్ ప్రభావంతో పత్తి నాణ్యత సి.సి.ఐ. నిర్దేశించిన ప్రమాణాలకు విరుద్ధంగా ఉండటంతో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని మిగిలిన మూడు అంశాలైన L1, L2, L3 జిన్నింగ్ మిల్లులను ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అదే విధంగా వర్షానికి తడిచిన లేదా రంగు మారిన పత్తిని తగిన ధర తగ్గింపులతో సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలని అచ్చెన్నాయుడు కేంద్ర జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి అచ్చెన్నాయుడు ఆ ప్రకటనలో తెలిపారు.

=======================

తిరుమల గిరిపై డిసెంబర్ 30 నుంచి 10 రోజుల పాటు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నామని టీటీడీ ఛైర్మన్ బీ. ఆర్. నాయుడు తెలిపారు. మొత్తం 182 గంటల దర్శన సమయంలో 164 గంటలు సామాన్య భక్తులకే కేటాయిస్తామని స్పష్టం చేశారు. టీటీడీ పాలక మండలి సమావేశం అనంతరం ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... మొదటి మూడు రోజులు 300 రూపాయలు, శ్రీవాణి దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు రోజుకు 15 వేలు 300 రూపాయల దర్శన టిక్కెట్లు, 1,000 శ్రీవాణి దర్శన టికెట్లు రెగ్యులర్ పద్ధతిలో కేటాయిస్తునట్లు టీటీడీ ఛైర్మన్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 22న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది ఆ తదుపరి 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఇక నైరుతి బంగాళాఖాతం దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక మీదుగా ఏర్పడిన నిన్నటి అల్పపీడనం కొమోరియన్ దాని పరిసర ప్రాంతాలలో కొనసాగుతోందని తెలియజేసింది. దీని అనుబంధిత ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.6 కిలో మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని, వీటి ఫలితంగా రాష్ట్రంలో పలు చోట్ల రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారి ఎల్. నారాయణ వెల్లడిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

======================
======================